సాక్షి
ఏలూరు
మంగళవారం। 6। ఫిబ్రవరి। 2024



ధర్మకర్తల మండలి ఏర్పాటు

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనర సింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పా టుకు నోటిఫికేషన్ జారీ చేశారని ఈఓ భవాని తెలిపారు. 20 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



ఆడ పిల్లలను రక్షిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. మాధవరం సెక్టార్‌లో భేటీ బచావో. భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు.



బాధ్యతల స్వీకరణ

ఏలూరు (మెట్రో): పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ యూనిట్–2 ఏలూరుకు సంబంధించి ల్యాండ్ ఎక్విజిషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మేరుగు ముక్కంటి బాధ్యతలు స్వీకరించారు.

సచివాలయం..సేవా నిలయం

- గ్రామాల్లోనే అన్నిరకాల ధ్రువీకరణ పత్రాల జారీ
- ప్రజలకు అందుబాటులో 154 రకాల సేవలు
- జిల్లాలో 605 సచివాలయాలు
- ఇప్పటివరకు రూ.75 లక్షలకు పైగా సర్వీసులు

ఏలూరు (మెట్రో): గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువ చ్చారు. గ్రామస్థాయిలోకి పాలనను చేరువచేసి సేవ లందిస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటుచేశారు. వీటి ద్వారా 154 రకాల సేవలు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.75 లక్షల విలు వైన సేవలను ప్రజలకు అందజేశారు.

605 సచివాలయాల ద్వారా..

గతంలో ఏ పని కావాలన్నా మండల కేంద్రాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇటు వంటి అవస్థలు లేకుండా గ్రామాల్లోనే అన్నిరకాల సేవలను సచివాలయాల ద్వారా అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 605 గ్రామ, వార్డు సచివాలయా లను ఏర్పాటు చేసి ఒక్కో సచివాలయంలో 10 మంది సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. జిల్లాలో 495 గ్రామ సచివాలయాలు 110 వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలంది స్తున్నారు. గతంలో జనన ధ్రువీకరణ పత్రం కావా లన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. మరణ ధ్రువీకరణ పత్రం కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ఇటువంటి ఇబ్బందులు లేకుం డా పలు రకాల ధ్రువీకరణ పత్రాల జారీతో పాటు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, వాహనాలకు సంబం ధించిన పత్రాలు ఇలా పలురకాల సేవలను సచి వాలయాల్లో అందిస్తున్నారు.



ఏలూరు మండలంలో శనివారపుపేట గ్రామ సచివాలయం



సచివాలయంలో సేవలందిస్తున్న సిబ్బంది (ఫైల్)

స్థానికంగానే సేవలు



గతంలో ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం సెక్రటరీ వద్దకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అటువంటి ఇబ్బంది లేకుండా గ్రామంలోనే ఆదాయ ధ్రువీకరణ పత్రానికి దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో నాకు సర్టిఫికెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసిం ది. అలాగే వలంటీర్ ద్వారా నేను దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాన్ని ఇంటికే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

– కె.గంగాభవాని, చాటపర్రు

చాలా ఆనందం



ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం గ్రా మంలోనే సచివాలయాలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. గతంలో మా పిల్లల చదు వులకు ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా మండల కేంద్రాల చుట్టూ, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం గ్రామంలో దరఖాస్తు చేసుకుంటే ఇక్కడే ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ఇటువంటి సేవ లభించడం ఎంతో అదృష్టం.

– సీహెచ్ దమయంతి, తిమ్మారావుగూడెం

తిరగాల్సిన పనిలేదు



గతంలో రుణాలకు సంబంధించి ఏ పత్రం కావాలన్నా పనులు మానుకుని అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పనులు మానకుండా గ్రామాల్లోనే సేవలు పొందుతున్నాం. రేషన్ కార్డు కోసం సచివాలయంలోనే దరఖాస్తు చేసుకున్నా. కార్డు మంజూరైన వెంటనే వలంటీర్ ద్వారా తెలియజేశారు. సచివాలయా నికి వెళ్లి రేషన్‌కార్డు తీసుకున్నా.

–సీహెచ్ పార్వతి, బాబూఖాన్‌గూడెం

న్యూస్‌రీల్

కేంద్రీయ విద్యాలయ భవనం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న డీసీ మంజునాథ్, ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు : నూజివీడులో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయ భవనాలను కేంద్రీయ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ డి.మంజునాథ్, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం పరిశీలించారు. స్థానిక ఎంప్లాయిస్ కాలనీలోని స్కూల్ భవనంలో 16 గదులతో సిద్ధం చేసిన భవనాన్ని పరిశీలిం చి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవర ణలో స్టేజ్ నిర్మాణం, సైకిల్‌స్టాండ్ ఏర్పాటుపై సూచించారు. రాష్ట్రంలో 8 కేంద్రీయ విద్యాల యాలు మంజూరు కాగా తరగతుల ప్రారంభం పై ఉత్తర్వులు రావాల్సి ఉందన్నారు. ముందు గా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు తరగతు లు ప్రారంభిస్తామన్నారు. సిబ్బందిని కాంట్రా క్టు పద్ధతిలో నియమిస్తామన్నారు. ఆర్డీఓ వై భవానీ శంకరి, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీ నారాయణ, ఏలూరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ వి.శోభన్‌బాబు, డీవైఈవో ఎం.సే వియా ఉన్నారు.

3.25 లక్షల టన్నుల ధాన్యం సేకరణ



బి.లావణ్యవేణి, జేసీ

ఏలూరు(మెట్రో) : జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో 3.36 లక్షల ట న్నుల ధాన్యం సేక రణ లక్ష్యంగా నిర్ణ యించి ఇప్పటివరకు 3,25,043 టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. 254 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 41,442 మంది రైతుల నుంచి రూ.710.05 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని, ఈ మేరకు రూ.657.85 కోట్లను వారి ఖాతాల్లో జమచేశా మన్నారు. మరో రూ.52.20 కోట్లు బ్యాంక్ వద్ద జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు. లక్ష్యం లో 97 శాతం ధాన్యం సేకరించామని, ధా న్యాన్ని పలు రైస్‌మిల్లులకు రవాణా చేశామ న్నారు. ఈనెల 15 నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిలుపుదల చేస్తామని, రైతులు గమనించాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ ఒకేష నల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ సోమవారం ప్ర శాంత వాతవరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 12 కేంద్రాల్లో నిర్వహించిన ప్రయో గ పరీక్షలకు 1,230 మంది హాజరయ్యారు. ఉదయం 889 మందికి గాను 803 మంది, మధ్యాహ్నం 689 మందికి 635 మంది హాజర య్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమో దు కాలేదని ఇంటర్మీడియెట్ పరీక్షల కన్వీనర్ బి. ప్రభాకర్ తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ నమోదుకు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గతేడాది ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ఎంపికైన వి ద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసేందుకు గడువు తేదీ పొడిగించినట్టు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ వరకు గడువు ఉందని, అప్ప టికీ ప్రక్రియ పూర్తికాకుంటే స్కాలర్‌షిప్ మం జూరుకాదని పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలతో అంగన్‌వాడీ కేంద్రం

ఇరగవరం : అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలో విస్తుపోయే విషయం బయటపడింది. కేవలం ఇద్దరు పిల్లలతో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేం ద్రాన్ని అధికారులు గుర్తించారు. ఇరగవరం మండలం రాపాక గ్రామంలో అంగన్‌వాడీ కేం ద్రాలను రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత సోమవారం తనిఖీ చేశారు. 197, 199 నంబర్ల కేంద్రాల్లో 8 మంది పిల్లలు, ముగ్గురు గర్భిణులు, 11 మంది బాలింతలు చొప్పున ఉన్నారు. అయితే 198వ నంబర్ కేం ద్రంలో మాత్రం ఇద్దరు ప్రీస్కూల్ పిల్లలు మాత్రమే ఉన్నారు. గర్భి ణులు ఐదుగురు, బాలింతలు ఇద్దరు కేంద్రంలో నమోదై ఉన్నా తనిఖీ సమయంలో లేరు. అంగన్‌వాడీ కేంద్రం లో కనీసం 10 మంది పిల్లలు తప్పనిసరిగా ఉండాలి. లేకుంటే కేంద్రాన్ని మూసివేయాలి. ఇవేమీ పట్టించుకోకుండా ఐసీడీఎస్ అధికారు లు ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని వినీత ఆగ్ర హం వ్యక్తం చేశారు. విషయాన్ని తణుకు సీడీ పీఓ ప్రమోదిని, సూపర్‌వైజర్ కాంతకుమారి దృష్టికి తీసుకువెళ్లగా ఇప్పటివరకు తమ దృష్టికి రాలేదని చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళతానని వినీత అన్నారు.

రాజ్యాధికారం కల్పించేలా
బీసీలకు పదవులు

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్



దెందులూరు: దళిత, బీసీలకు రాజ్యాధికారం కల్పిం చడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశ యమని, ఈ మేరకు ఏలూరు ఎంపీ స్థానంలో వైఎ స్సార్‌సీపీ బీసీ అభ్యర్థిని బలపర్చినట్టు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సోమవారం చింతల పూడిలో చంద్రబాబు చేసిన అసత్య ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో చంద్రబాబు ఏం చేశారో చర్చకు సిద్ధ మేనా అని ప్రశ్నించారు. గత టీడీపీ పాలనలో రైతుల కోసం ఏమీ చేయకపోతే.. వేలాది మంది రైతుల సంక్షేమానికి తాము ధర్మాజీగూడెం పాలవా గుకు రూ.50 లక్షలు వెచ్చించామన్నారు. టీడీపీ హయాంలో ఎంపీ నిధులను వాడలేదని, వాటిని సైతం ప్రతిపైసా తాము ఖర్చు చేశామని, రికార్డులు సైతం తీసుకువచ్చి నిరూపిస్తామని సవాల్ విసి రారు. కరోనా సమయంలో ఆక్సిజన్ యూనిట్లు, మందులు, వైద్య సేవలు, రోగులకు వసతి ఎవరు కల్పించారో టీడీపీ నాయకులను అడిగి చంద్ర బాబు తెలుసుకోవాలన్నారు. తాను ఎంపీ నిధు లను రైతుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణానికి వెచ్చించా నన్నారు. జీలుగుమిల్లిలో 2 వేల ఎకరాల్లో నేవీ బేస్ క్యాంపు ఏర్పాటుకు కేంద్ర రక్షణ శాఖ మం త్రి, ఉన్నతాధికారు లతో చర్చించామని, బేస్‌క్యాంపు ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతుందన్నారు. ఏలూరు నియోజకవ ర్గంలోని ప్రధాన సమ స్యలతో పాటు రాష్ట్రంలోని పెండింగ్ సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించి, వాటిలో కొన్నింటి పరి ష్కారానికి కృషి చేశామన్నారు. తనకు గత ఎన్ని కల్లో 1.65 లక్షల ఓట్ల మెజార్టీ వచ్చిందని, ఇది జిల్లాలో తనకున్న ప్రజాదరణకు నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ఓడిపోతామని భావిం చిన చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను దూషించారని, ఇది చంద్రబాబు అహంకారానికి, పెత్తందారీ మనస్తత్వానికి నిదర్శనమని మండిప డ్డారు. చంద్రబాబు దిగజారుడుతనానికి ఇది అద్దం పడుతుందన్నారు. చింతలపూడిలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలోని దళితులు, బీసీలు, గిరి జనులు గుర్తుంచుకుంటారన్నారు.

సత్రాల ధర్మకర్తల మండలికి దరఖాస్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో దేవదాయ శాఖ పరిధిలోని రెండు సత్రాలకు ధర్మకర్తల మండళ్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు ఆ సత్రాల కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు ప్రకటనలో తెలిపారు. ఏలూరు లోని మద్దుల వారి సత్రం, చుండూరు వారి స త్రాలకు ధర్మకర్తల నియామకాలకు నోటిఫికేషన్ విడుదలయ్యిందన్నారు. ఒక్కో సత్రానికి ఏడు గురు ధర్మకర్తలను నియమించే అవకాశం ఉంద ని, అభ్యర్థులు 15 రోజుల్లో దరఖాస్తులను ఏ లూరులోని దేవదాయశాఖ జిల్లా అధికారి కార్యా లయంలో సమర్పించాలని ఆదేశించారు.

డీఈఎల్ఈడీ ఫీజులు చెల్లించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డిప్లొమా ఇన్ ఎలిమెం టరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) మొదటి సెమి స్టర్ 2022–24 బ్యాచ్, 2021–23 బ్యాచ్‌లో ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజుల చెల్లింపునకు షెడ్యూల్ విడుదలైనట్టు డీఈఓ పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. 11 వరకు గడువు ఉం దని, రూ.50 అపరాధ రుసుంతో ఈనెల 15 వ రకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.150, 3 సబ్జెక్టులకు రూ.140, ఒక సబ్జెక్టుకు రూ.100 చెల్లించాలన్నారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం



ఏలూరు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం–స్పందన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ వె.ప్రసన్న వెం కటేష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జగ నన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో జా యింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్వో డి.పుష్ప మణి, జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరా జు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీతో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 223 అర్జీలు అం దాయన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ద్వారకాతిరుమల దేవస్థానం సిబ్బంది తమ భూమిపై ప్రవేశించి సరిహద్దు గట్లు, చెట్లు, రాళ్ల తీసివేసి జెండాలు పాతారని న్యాయం చేయా లని ద్వారకాతిరుమలకు చెందిన రాజగోపాల రావు అర్జీ అందజేశారు.
- పేరంపేటకి చెందిన లక్ష్మి తమ భూమి మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే వెళుతోందని, నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.
- కూచిపూడికి చెందిన దేవమణి తన భర్త పేరున మూడు విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు చెబుతున్నా రని, వాటిని సరిచేయాలని అర్జీ అందజేశారు.
- నిడమర్రుకి చెందిన సుమిత్ర తమ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు.
- కె.గోకవరానికి చెందిన రాఘవేంద్రరావు తమ పట్టా భూమిలో నుంచి పంచాయతీ పైపులైను వేశారని, తొలగించాలని అర్జీ అందజేశారు.

మహిళాభ్యున్నతికి 'ఆసరా'

రాష్ట్రంలో మహిళాభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ వారి సాధికారతకు కృషి చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల్లో ఆసరా కార్యక్రమాలు నిర్వహించారు.

– భీమడోలు/కొయ్యలగూడెం



పూళ్లలో ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు



కొయ్యలగూడెంలో సభకు హాజరైన మహిళలు


ఆసరాతో తోడ్పాటు



నేను ఎంబ్రాయిడరీ షాపు నిర్వహిస్తున్నా. నా కాళ్లపై నేను నిలబడేందుకు ఆసరా పథకం తోడ్పాటు అందిస్తోం ది. నాలుగు విడతల లబ్ధి అందింది. మళ్లీ సీఎంగా జగ నన్న రావాలని కోరుకుంటున్నా.

– అదపా భూజనని, బయ్యన్నగుడెం

లబ్ధితో జీవనోపాధి



సీఎం జగన్ హామీ మేరకు ఆసరా పథకం ద్వారా ఏటా సాయం అందిస్తున్నారు. ఈ మొత్తం నా జీవనోపాధికి ఉపయోగపడింది. టైలరింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా.

–చవల రామలక్ష్మి, దిప్పకాయలపాడు

పేదల జీవితాల్లో వెలుగులు

పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం జగన్ లక్ష్యం. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం.

– పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

(పూళ్లలో సోమవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



పూళ్లలో లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందిస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ప్రతి మహిళా గర్విస్తోంది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉన్నందుకు ప్రతి మహిళా గర్విస్తోంది. హామీ మేరకు జగనన్న డ్వాక్రా రుణమాఫీని ఆసరా పథకం కింద అమలు చేస్తున్నారు.

– తెల్లం రాజ్యలక్ష్మి, పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి

(కొయ్యలగూడెంలో సోమవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



కొయ్యలగూడెంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి

అడవిలోకి పెద్ద పులి

- కనిపించని అడుగుల జాడ
- ఊపిరి పీల్చుకున్న ప్రజలు



కొవ్వాడ అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరా

బుట్టాయగూడెం: రెండు వారాలుగా జిల్లాలోని పలు మండలాల్లోని ప్రజలను, ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ అధికారులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పెద్ద పులి అడవిలోకి వెళ్లినట్లు అటవీశాఖ అధికారులు చెప్పారు. ఆదివారం బుట్టాయగూడెం మండలం కొవ్వాడ సమీపంలో ఆవుపై పులి దాడి చేసి చంపిన విషయం తెలిసిందే. అయితే ఆవు కళేబరం వద్దకు పులి మళ్లీ తిరిగి వచ్చే అవ కాశం ఉందని భావించిన వైల్డ్‌లైఫ్ అధికా రులు ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాప్ కెమెరా లను ఏర్పాటుచేశారు. అలాగే పులిని బంధిం చేందుకు బోనులను కూడా సిద్ధం చేశారు. అయితే నాగన్నగూడెం కొండ వైపునకు వెళ్లిన పులి మళ్లీ తిరిగి వచ్చిన జాడలు ఎక్కడా కని పించలేదని అధికారులు అన్నారు. సోమవారం అన్ని ప్రాంతాల్లో పరిశీలిం చామని ఎక్కడా కూడా పులి సంచరించనట్లు జాడలు లేవన్నారు. దీంతో అడవిలోనే పులి సంచరించే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియాలో పులి సంచారంపై అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచిం చారు. ట్రాప్ కెమెరాలు మరికొద్ది రోజుల పాటు అలానే ఉంచుతామని చెప్పారు.

'సర్పంచ్‌ల చలో అసెంబ్లీ'కి అనుమతి లేదు

ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి



ఏలూరు టౌన్: ఏపీ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి అనుమతులు లేవని ఎస్పీ డీ మేరీప్రశాంతి స్పష్టం చేశారు. ఈ నెల 6న సర్పంచ్‌ల చలో అసెంబ్లీ కార్యక్రమంలో ఎవరూ పాల్గొనవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉండటంతో దీనికి అనుమతులు నిరాకరించామన్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న కారణంగా ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు లేవన్నారు. పోలీసు యాక్ట్‌ను ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి



స్పందనలో ఓ వ్యక్తి అర్జీ పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక స్పందనలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ఓటరు నమోదు అంటూ బయోమెట్రిక్ మిషన్‌తో వేలిముద్రలను సేకరిస్తూ ఓటీపీ వస్తుందని చెప్పి మోసాలకు పాల్పడే వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

స్పందనలో అందిన ఫిర్యాదులలో కొన్ని..

తన కుమార్తెకు తొమ్మిదేళ్ల క్రితం కట్నకానుకలు ఇచ్చి వివాహం చేశామని, అయితే అల్లుడు, అత్తమామలు తన కుమార్తెను మానసికంగా, శారీరకంగా హింసించగా ఆత్మహత్య చేసుకుందని, మరణ వాంగ్మూలం ఇచ్చినా కేసు నమోదు చేయలేదని, కనీసం చర్యలు తీసుకోలేదని పెదపాడు మండలం రాజంపేట ప్రాంతానికి చెందిన వ్యక్తి అర్జీ ఇచ్చాడు. తనకు జాతీయ రహదారుల ప్రాజెక్ట్ ఇప్పిస్తానని చెప్పి తన నుంచి ఓ వ్యక్తి రూ.4.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు శనివారపుపేటకు చెందిన ఓ వ్యక్తి కోరారు. తాను ప్రేమ వివాహం చేసుకున్నానని, ప్రస్తుతం ఆమె గర్భిణి అని, అత్తింటివారు ఆమెను తీసుకువెళ్లి తిరిగి పంపడం లేదని జంగారెడ్డిగూడెంకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కామవరపుకోట: అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పి.శివరామ కృష్ణ చెప్పారు.



కళ్లచెరువులో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివరామకృష్ణ

ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారం మేరకు కళ్లచెరువు గ్రామంలో చౌటుపల్లి నాగరాజు ఇంటిలో సోమవారం తనిఖీలు నిర్వహించగా 60 ప్లాస్టిక్ గోనె సంచుల్లో నిల్వ ఉంచిన 300 కేజీల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. చౌటుపల్లి నాగరాజు, కేస్ రామవరానికి చెందిన చిక్కాల సుబ్బారావులపై కేసు నమోదు చేశారు. బియ్యం విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ తహసీల్దార్ బి.కన్యాకుమారి, ఆర్ఐ కె.సారథి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసులో భర్తకు మూడేళ్ల జైలు

ఏలూరు టౌన్: దిశా పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన ఒక కేసులో భార్యను అధిక కట్నం కోసం వేధించిన భర్త నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ఏలూరు న్యాయమూర్తి ఎస్.వాసుదేవ్ నిందితుడికి మూడేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కేతవర్త్ కిషన్ నాయక్ అనే వ్యక్తి భార్యను అధిక కట్నం కోసం వేధించాడు. ఈ కేసుకు సంబంధించి భార్య 2020లో ఏలూరు దిశా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు బాధితురాలి తరపున పూర్తి స్థాయి సమాచారం, ఆధారాలతో కోర్టుకు చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పి.హేమలత, దిశా పోలీస్‌స్టేషన్ ఎస్సై కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కన్విక్షన్ బేస్ట్ పోలీసింగ్‌లో భాగంగా ట్రయల్ కేసులో ప్రత్యేక శ్రద్ధ వహించి సాక్ష్యాధారాలను కోర్టు ముందు ఉంచారు. న్యాయమూర్తి వాదోపవాదాలను విని సాక్షాధారాల ఆధారంగా నిందితుడికి శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీప్రశాంతి, దిశా డీఎస్పీ నున్నా మురళీకృష్ణ, సీఐ పి.విశ్వం, కోర్టు హెచ్‌సీ ఎం.వెంకటరమణ, కానిస్టేబుల్ కె.లక్ష్మీనారాయణను ప్రత్యేకంగా అభినందించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

పెదవేగి: అభం శుభం తెలియని ఓ చిన్నారిపై అదే గ్రామానికి చెందిన కామాంధుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూచింపూడి గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి యత్నించాడు. నిందితుడు బాలికకు మాయమాటలు చెప్పి ఆదివారం సాయంత్రం కూచింపూడి సచివాలయం సమీపంలోని కోనేరు దగ్గరికి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. అక్కడకు సమీపంలో వాలీబాల్ ఆడుతున్న యువకులు అతని చేష్టలు గమనించి గట్టిగా కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పెదవేగి సీఐ శ్రీనివాస్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం విచారణ చేశామని ఎస్సై రాజేంద్రప్రసాద్ చెప్పారు. ఎస్సై మాట్లాడుతూ లైంగిక దాడికి యత్నించిన యువకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అతని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

మృతదేహం లభ్యం

యలమంచిలి: పేరుపాలెంకు చెందిన తమ్మా అశ్వనీకుమార్ (26) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు పడవలో నుంచి గోదావరిలో పడిపోవడంతో మరణించినట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. ఈ నెల మూడో తేదీన అశ్వనీకుమార్ గోదావరిలో పడిపోగా సోమవారం గోదావరిలో కొత్తగా నిర్మాణంలో ఉన్న రైలు బ్రిడ్జి వద్ద మృతదేహం లభించిందన్నారు.